సాక్షి సిద్దిపేట

శనివారం | 5 | ఆగస్టు | 2023



ఆర్టీఓ కార్యాలయం వద్ద క్యూలో దరఖాస్తుదారులు

డ్రైవింగ్ లైసెన్సుల కోసం బారులు

సిద్దిపేట ఆర్టీఓ కార్యాలయం సందడిగా మారింది. డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోలాహలం నెలకొంది. కొందరు నాయకులు ఫ్రీగా లైసెన్స్‌లు ఇప్పిస్తుండడంతో యువకులు, మహిళలు, వృద్ధులు సైతం లెర్నింగ్ లైసెన్స్‌ల కోసం ఫొటోలు దిగేందుకు శుక్రవారం కార్యాలయంలో బారులుదీరారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

న్యూస్‌రీల్

రైతులను ఆదుకోవాలి : ఎమ్మెల్యే



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

దుబ్బాకటౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే రఘునందన్‌రావు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పంటల నష్టం వివరాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాల వల్ల పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం వచ్చిందని, వారిని కలిసి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



బస్టాండ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ముత్యంరెడ్డి

గజ్వేల్: పట్టణంలో కొనసాగుతున్న పత్తి మార్కెట్ యార్డు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌తో కలిసి 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ వైద్యారోగ్యశాఖలోని ఎన్‌హెచ్‌ఎం విభాగంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం వారు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ల రాష్ట్ర కార్యదర్శి శ్రీలత, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రీతమ్‌కుమార్, ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శి రాము, ప్రచార కార్యదర్శి వినయ్‌జోసెఫ్, టెక్నీషియన్లు శ్రీకాంత్, అంబిక, సౌందర్య, ఇమ్రాన్, వంశీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భూంపల్లి విద్యార్థులు



యు. వెంకటేశ్



బి. వెన్నెల

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీలకు అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 7వ తేదీన హన్మకొండలో జరిగే అండర్–14 జావెలిన్ త్రో పోటీల్లో భూంపల్లి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు బి.వెన్నెల, అండర్–16 విభాగం జావెలిన్ త్రో 100 మీటర్ల విభాగంలో యు. వెంకటేష్ పాల్గొంటారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ అభినందించారు.

దరఖాస్తులు తొలిరోజు నిల్

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో 93 వైన్ షాప్‌లకు లైసెన్స్‌ల (2023–2025) కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజు ఒక్క దరఖాస్తు రాలేదు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 18వ తేది వరకు వీటిని స్వీకరిస్తారు. 21న కలెక్టర్ సమక్షంలో విపంచిలో డ్రా ద్వారా లైసెన్స్‌లను కేటాయించనున్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా నూతన కమిటీ

సిద్దిపేటకమాన్: ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ఆధ్వర్యంలో సిద్దిపేట మహాసభ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఇట్టబోయిన శ్రీనివాస్, అధ్యక్షుడిగా ధర్మా, ప్రధాన కార్యదర్శిగా బర్ల మల్లికార్జున్, కార్యదర్శిగా పాపయ్య, వెంకటస్వామి, గౌరవ సలహాదారుడిగా దుర్గం పరశురాములు, కార్యవర్గ సభ్యుడిగా శేఖర్, పరశురాములు, నియోజకవర్గ యువత అధ్యక్షుడిగా గాడిచర్ల సతీష్, కార్యదర్శిగా శ్రావణ్‌లను ఎన్నుకున్నారు.

811 వీఆర్‌ఏల సర్దుబాటు

- వివిధ ప్రభుత్వ శాఖలలో పోస్టులు మంజూరు
- త్వరలో పోస్టింగ్‌లు
- మొత్తం వీఆర్‌ఏలసంఖ్య 1071

సాక్షి, సిద్దిపేట: దశాబ్దాలుగా కొనసాగిన గ్రామ రెవెన్యూ వ్యవస్థ కనుమరుగైంది. ఇప్పటికే గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌ఓ) వ్యవస్థను రద్దు చేసి, వారిని ఇతర శాఖలల్లో సర్దుబాటు చేసిన ప్రభుత్వం... తాజాగా వీఆర్‌ఏ(గ్రామ రెవెన్యూ సహాయకులు) వ్యవస్థనూ రద్దు చేసింది. వారికి పే స్కేల్ వర్తింపజేస్తూ ఇతర శాఖల్లో అవకాశాలను కల్పించింది. జిల్లాలో 1,071 వీఆర్‌ఏలుండగా వారి విద్యార్హతతో పాటు వయసును పరిగణనలోకి తీసుకుని 811 మందిని సర్దుబాటు కోసం పోస్టులను మంజూరు చేశారు. మిగతా వారిలో 61యేళ్లు దాటిన వారు ఉండగా, కొందరు మృతి చెందిన వారున్నారు.

వివిధ శాఖలకు కేటాయింపు

వీఆర్‌ఏలను వివిధ ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేశారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌లుగా 107, రికార్డ్ అసిస్టెంట్‌లుగా 98, ఆఫీస్ సబార్డినేట్‌గా 21, చైన్‌మెన్‌లా 22, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులుగా 51, మిషన్ భగీరథలో హెల్పర్‌లుగా 156, నీటి పారుదల శాఖలో లష్కర్‌లుగా 272, హెల్పర్‌లుగా 84 పోస్టులను కేటాయించింది. త్వరలో వీరికి ఎవరికి ఏ విభాగంలో విధులు నిర్వర్తించాలని ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ జారీ చేయనున్నారు.

రైతు బీమా దరఖాస్తుకు నేడు తుది గడువు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమాకు శనివారం చివరి గడువని, అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఈవో, ఏవోలకు దరఖాస్తులు అందించాలని సూచించారు.

బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూమ్



స్ట్రాంగ్ రూమ్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

దుబ్బాకటౌన్: అసెంబ్లీ ఎన్నికల కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శుక్రవారం పట్టణంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ఎలక్షన్ స్ట్రాంగ్‌రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్కూల్ ఆవరణలో సీసీ కెమెరాలు, లైట్లు అమర్చాలని సూచించారు. ఈవీఎం మిషన్లు రాగానే గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని దుబ్బాక నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

కాంట్రాక్టర్‌పై సీరియస్

దుబ్బాక పట్టణంలో జరుగుతున్న ఐఓసీ భవనం నిర్మాణ పనులను శుక్రవారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పరిశీలించారు. పనుల జాప్యంపై కాంట్రాక్టర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

పాఠాలు అర్థమవుతున్నాయా?

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ టెన్త్ విద్యార్థులతో ముచ్చటించారు. పాఠాలు ఎలా చెబుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అమీబా స్పెల్లింగ్ అడగగానే విద్యార్థులు వెంటనే సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, ప్రిన్సిపాల్ సుప్రియ తదితరులున్నారు.

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్

- జిల్లాలో వచ్చిన దరఖాస్తులు 79,246
- మూడు నెలల్లో పరిశీలించింది 11,441
- ఇప్పటి వరకు అప్రూవల్ ఇచ్చింది 355 మందికే..
- నిరీక్షిస్తున్న దరఖాస్తు దారులు

దరఖాస్తుల వివరాలు

పరిధి	దరఖాస్తులు	మొదటి విడత పరిశీలన
సిద్దిపేట మున్సిపాలిటీ	32,354	6,711
గజ్వేల్	11,544	506
చేర్యాల	6,069	200
హుస్నాబాద్	6,056	187
దుబ్బాక	1,884	487
సుడా	21,339	3,350

ఎన్నాళ్లీ పరిశీలన!

నిబంధనలకు విరుద్ధంగా, అనధికార లేఅవుట్లలో ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. దరఖాస్తుల పరిశీలనలో తీవ్ర జాప్యం జరుగుతుంది. మూడు నెలలు గడుస్తున్నా పరిశీలన జరిగింది గోరంతే. ఇలాగే పరిశీలన కొనసాగితే మూడేళ్లయినా పూర్తికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సుడా పరిధిలో ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, సిద్దిపేట: మున్సిపల్, సుడా అనుమతులు లేకుండా చేసిన లేఅవుట్ వెంచర్లలో కొనుగోలు చేసిన స్థలాలను రెగ్యులరైజ్ చేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. ప్రక్రియ ప్రారంభమై మూడు నెలలవుతున్నా పూర్తి చేయకపోవడంతో దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

జిల్లా వ్యాప్తంగా 79వేల దరఖాస్తులు

ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లలో కొనుగోలు చేసిన స్థలాలను క్రమబద్ధీకరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకువచ్చింది. ఒక్కో దరఖాస్తుకు వెయ్యి రూపాయల చొప్పున స్వీకరించి 2020, ఆగస్టు 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలు, సుడా పరిధిలో 79,246 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో దరఖాస్తు పరిశీలనను మే నెలలో ప్రారంభించారు. మొదటి విడతగా ఇప్పటి వరకు 11,441 దరఖాస్తులు మాత్రమే పరిశీలించారు. అందులో 355 మంది దరఖాస్తులను అప్రూవల్ చేశారు. మరికొన్ని షార్ట్‌ఫాల్ ఉన్నాయని దరఖాస్తు దారులకు సమాచారం పంపించారు. మరికొన్ని అప్రూవల్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులో పేర్కొన్న స్థలాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి బఫర్‌జోన్, గ్రీన్‌జోన్, కమర్షియల్ జోన్లలో ఉందా లేదా అని పరిశీలిస్తున్నారు. అనంతరం స్థలం విలువ ఆధారంగా పెనాల్టీకి సంబంధించి డిమాండ్ నోటీసును జారీ చేస్తున్నారు. ఆ డబ్బులను ప్రభుత్వం నిర్దేశించిన అకౌంట్‌లో చెల్లించాలి. దీంతో స్థలం రెగ్యులరైజేషన్ అవుతుంది.

సిబ్బంది కొరత

జిల్లాలోని మున్సిపాలిటీల్లో సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తుల పరిశీలన జాప్యం జరుగుతోంది. ఒక్కో దరఖాస్తుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పేపర్‌లు, మ్యాప్ ప్రకారం ఉందా, ఎంత విస్తీర్ణంలో ఉంది, స్థలం పై ఏమైనా కేసులు ఉన్నాయా..? ఇలా అన్ని వివరాలను పరిశీలించాలి. దీంతో ఒక్కో దరఖాస్తుకు సుమారుగా రెండు గంటల సమయం పడుతుంది. మున్సిపాలిటీలలో సిబ్బందికి ఇప్పటికే పనిభారం ఉండగా.. ఇది అదనపు భారంగా మారింది. దీంతో పరిశీలన నెమ్మదిగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక సిబ్బందిని నియమించి దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తయ్యేలా చూడాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు.

పరిశీలిస్తున్నాం

దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. సుడాకు ఇటీవలనే లాగిన్ ఇచ్చారు. దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు లేనివాటికి సంబంధించి షార్ట్‌ఫాల్ సమాచారాన్ని ఫోన్ ద్వారా దరఖాస్తుదారులకు పంపిస్తున్నాం. వివరాలు తిరిగి అప్‌లోడ్ చేస్తే ప్లాట్ దగ్గర వాటిని పరిశీలిస్తున్నాం.

– వందనం, సీపీఓ, సుడా

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



సంచి పట్టుకుని చెత్తను ఏరుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 3వ వార్డులో ఉదయం 'నడుస్తూ చెత్త ఏరుదాం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వార్డులో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సంచి పట్టుకొని చెత్త ఏరారు. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడారు. స్వచ్ఛ సిద్దిపేటకు అందరూ కృషి చేయాలన్నారు. డ్రైడే ను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ బాబు

రసాయనశాస్త్ర పరిశోధనలు కీలకం

ఐఐసీటీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సురేష్ బాబు

సిద్దిపేట ఎడ్యుకేషన్: మానవాళి పురోగతిలో రసాయనశాస్త్ర పాత్ర గొప్పదని, భవిష్యత్తులో దాని పరిశోధనలు కీలకమని ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో జీవ రసాయన శాస్త్ర పరిశోధనల ద్వారా ఔషధాలు తయారు చేశారన్నారు. రసాయన శాస్త్ర విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ వాసం శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 230 పరిశోధన పత్రాలు అందాయని తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా డాక్టర్ శంకరయ్య, ప్రొఫెసర్ సీహెచ్.ప్రసాద్, సదస్సు కో కన్వీనర్లు ఆంజనేయులు, శ్యాంసుందర్, అధ్యాపకులు బాలకృష్ణ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సుమలత, డాక్టర్ మనోహర్, సలీం పాషా, డాక్టర్ మధుసూదన్, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ భవాని, డాక్టర్ అయోధ్యరెడ్డి, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలే ముఖ్యం

సిద్దిపేట సీపీ శ్వేత



సిద్దిపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఆర్‌ఏఎఫ్ సిబ్బంది, పోలీసు అధికారులు

సిద్దిపేటకమాన్: ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ, భరోసా కల్పిస్తున్నట్లు సీపీ ఎన్.శ్వేత అన్నారు. పట్టణంలో సికింద్రాబాద్ హకీంపేట్ 99బెటాలియన్‌కు చెందిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) సిబ్బందితో కలిసి పోలీసు అధికారులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ముస్తాబాద్ చౌరస్తా ప్రారంభమైన మార్చ్ బీజేఆర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అవగాహన కార్యక్రమంలో భాగంగా భౌగోళిక పరిస్థితులు తెలుసుకోవడానికి ఈ ఫోర్స్ జిల్లాకు వచ్చిందన్నారు. శాంతిభద్రతల సమస్య ఎదురైనప్పుడు వీరు జిల్లా పోలీసులకు సహాయ అందిస్తారని తెలిపారు. 5వ తేదీన గజ్వేల్‌లో, 6న దుబ్బాకలో, 7న హుస్నాబాద్‌లో, 8న చేర్యాలలో ఫ్లాగ్ మార్చ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ నవీన్ కుమార్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీటౌన్ సీఐ భానుప్రకాష్, రూరల్ సీఐ చేరాలు, ఆర్‌ఏఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

టీషర్టులు పంపిణీ

ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా ఈనెల 6వ తేదీన రంగనాయక్‌సాగర్ ప్రాజెక్ట్ వద్ద నిర్వహించనున్న హాఫ్ మారథాన్‌ను విజయవంతం చేయాలని సీపీ శ్వేత పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం టీషర్ట్స్, మెటీరియల్ పంపిణీ చేశారు. సమావేశంలో రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాపురెడ్డి, రాజు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌కు మద్దతుగా..

హాఫ్ మారథాన్ రన్‌కు మద్దతుగా హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు శ్రీకాంత్ అనే యువకుడు 100కే రన్ నిర్వహిస్తున్నాడు. అదేవిధంగా హైదరాబాద్ నేచర్ క్యూర్ ఆసుపత్రి డాక్టర్ నాగలక్ష్మీ (56) హైదరాబాద్ నుంచి సిద్దిపేట వరకు సైక్లింగ్ చేస్తున్నట్లు ఓ వీడియో రిలీజ్ చేశారు.

వ్యవసాయ వనరుగా తెలంగాణ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): కాళేశ్వరంతోపాటు పలు ప్రాజెక్టులు నిర్మించి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని వ్యవసాయ వనరుగా తీర్చిదిద్దారని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. శుక్రవారం చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతకుముందు చిన్నకోడూరు నుంచి ఇబ్రహీంనగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సమావేశంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షులు పాపయ్య, సర్పంచ్‌లు ఉమేష్ చంద్ర, సుభాష్, ఎంపీటీసీ శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న రచయితలు

సిద్దిపేటకమాన్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 12న జరిగే సెక్యులర్ రైటర్స్ ఫోరం సమూహ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కే.రంగాచారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రైటర్స్ ఫోరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, అంజయ్య, అశోక్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

జేఏసీ చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

సిద్దిపేటరూరల్ / చేర్యాల, (సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిలపక్షం జేఏసీ ఆధ్వర్యంలో చేర్యాల నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ చేర్యాలను ముక్కలుగా విడిదీసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తాలూకాగా, నియోజకవర్గ కేంద్రంగా వెలుగొందిన చేర్యాలను చిన్న మండలంగా కుదించడం సరికాదన్నారు. ఆందోళనలు, తీర్మానాలు చేసినా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికేతరుడు కాబట్టే వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్. మంత్రి హరీశ్‌రావు స్పందించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ అంశం నిర్లక్ష్యం చేస్తే రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు వకులాభరణం నర్సయ్య పంతులు, సీపీఐఎం జిల్లా ఆముదాల మల్లారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆది శ్రీనివాస్, కొమ్ము నర్సింగరావు, మల్లిగారి యాదయ్య, సిద్దయ్య, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో సెకండ్ ఏఎన్ఎంలు


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నర్సాపూర్ : తమను రెగ్యులర్ చేయాలన్న డిమాండ్‌తో శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి సెకండ్ ఏఎన్ఎంలు పిలుపునివ్వగా పోలీసులు ముందస్తుగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ పీసీసీ ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, పార్టీ నాయకుడు అశోక్‌గౌడ్, చిన్న అంజిగౌడ్, సురేష్, అజ్మత్, శ్రీశైలంయాదవ్‌లతోపాటు ఏఐటీయూసీ నాయకుడు నందం తదితరులు స్టేషన్‌కు వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం హామీలు ఇస్తుందే గానీ అమలు చేయడం లేదని వారు విమర్శించారు. మధ్యాహ్నం ఏఎన్ఎంలను సొంతపూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

భవనాలకు భూమి కేటాయించాలని వినతి

నర్సాపూర్: కులసంఘాల భవనాలకు రెండేసి ఎకరాల భూమి కేటాయించాలని మున్నూరు కాపు కులస్తులు, దళిత సంఘాల నేతలు, ముదిరాజ్ కులసంఘ నేతలు ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిని శుక్రవారం కోరారు. మదన్‌రెడ్డి స్పందిస్తూ నియోజకవర్గంలో ఆయా కులాల జనాభా ప్రాతిపదికన భూమి కేటాయించనున్నట్లు చెప్పారు. మున్నూరు కాపు సంఘ నాయకులు బాల్‌రాజ్, శంకర్, నర్సింగ్ రావు, దళితసంఘాల నాయకులు భిక్షపతి, సంజీవ, రాంచందర్ తదితరులు, ముదిరాజ్ సంఘ నాయకులు దశరథ, జగదీశ్వర్ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


నాగమణి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మాసాయిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. ఎరుకలవాడలో ఉంటున్న పొట్టొల్ల నాగమణి(38) తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతిచెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, చేగుంట ఎస్‌ఐ హరీష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి దుస్తులు చిందరవందరగా పడడంతోపాటు శరీరంపై గాయాలను గుర్తించారు. ఆమె భర్త మృతిచెందగా చిన్నశంకరంపేట మండలం శాలిపేటకు చెందిన బ్యాగరి రాములుతో సహజీవనం చేస్తోంది. ప్రస్తుతం రాములు పరారీలో ఉన్నాడు. మృతురాలి కూతురు నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరీష్ తెలిపారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

శివ్వంపేట(నర్సాపూర్): ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండల పరిధిలోని తాళ్లపల్లి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన అన్నదమ్ములు పిల్లలు కేష్యానాయక్, రమేశ్‌నాయక్‌ల మధ్య భూ వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. తండా వాసులు కల్పించుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కిరాణా సామగ్రి తెస్తుండగా..


నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) గాయపడ్డ కన్నయ్యలాల్

- స్కూటీ, కారు ఢీకొని ఇద్దరి మృతి
- మరొకరికి గాయాలు
- మృతులంతా ఉత్తరప్రదేశ్‌వాసులు
- తునికి సమీపంలో ఘటన


ప్రమాదస్థలంలో బైక్

కౌడిపల్లి(నర్సాపూర్): బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఒకరికి గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మండలంలోని తునికి సమీపంలో గురువారం అర్ధ రాత్రి జరిగింది. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం హర్దోమ్ జిల్లా మదోగంజ్ స్టేషన్ పరిధిలోని సెల్వాపూర్‌కు చెందిన అనుజ్‌కుమార్(22), సరజ్‌కుమార్(19), రైదాస్ కన్నయ్యలాల్, రైదాస్ ప్రమోద్‌కుమార్ మేస్త్రీ పని కోసం గతనెల వచ్చారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి వద్ద ఆబేద్‌ఖాన్ సిమెంట్ ఇటుకలు, సిమెంట్ ప్లేట్స్ పనిచేస్తూనే అక్కడే ఉంటున్నారు. గురువారం రాత్రి కౌడిపల్లి మండలం వెంక్రటాపేటగేట్ వద్ద కిరాణా సామగ్రి తీసుకుని రెడ్డిపల్లికి పయనం అవుతున్నారు. తునికి రామానాయుడు విజ్ఞానజ్యోతి సమీపంలో 765డి జాతీయ రహదారిపై నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వస్తోన్న కారు, వీరు ప్రయాణిస్తున్న స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనుజ్‌కుమార్, సరజ్‌కుమార్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కన్నయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలు, క్షతగాత్రుడిని నర్సాపూర్ ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం యూపీకి తరలించారు. కారు డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా నడుపుతూ బైక్‌ను ఢీకొనడంతోనే ప్రమాదం జరిగిందని తోటి స్నేహితుడు ఉత్తరప్రదేశ్ వాసి ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆగంతకుడి బురిడీ

- యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందన్న పోస్టుకు స్పందించాడు
- యజమాని నుంచి రూ.1.98 లక్షలు నొక్కాడు

పటాన్‌చెరు టౌన్: ఓ యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందని యజమాని పోస్టు పెట్టారు. ఆగంతకుడి కాల్‌కు స్పందించి నగదు పోగొట్టుకున్నారు. ఈ సంఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన వ్యక్తి ఓ యాప్‌లో ఇల్లు అద్దెకు ఉందని యజమాని పోస్టు పెట్టాడు. జూలై 18న ఆగంతకుడు కాల్ చేశాడు. అతను ఆధార్, పాన్ కార్డులను పంపించాడు. తన అకౌంట్‌కు రూ.5లు పంపమన్నాడు. తిరిగి రూ.10లు యజమాని ఖాతాలో జమ చేశాడు. నగదు రెట్టింపు చేస్తానంటూ దఫాలవారీగా రూ. 39 వేలు, రూ.38,995లు వసూలు చేశాడు. చివరకు 1.98లక్షలు వేసినా ఇంకా వేయాలని అడుగుతుండగా మోసపోయాయని బాధితుడు గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్, పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొంతన్‌పల్లిలో త్రిపుల్‌ఆర్ సర్వే

- 70 ఎకరాలు సేకరణ


కొంతన్‌పల్లిలో సర్వే సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండలపరిధి కొంతన్‌పల్లిలో ఔటర్‌రింగు రోడ్డు కోసం భూ సేకరణకు సంబంధించి శుక్రవారం సర్వే చేపట్టారు. కొంతన్‌పల్లిలో గతంలో భూ సర్వే సిబ్బందిని రైతులు అడ్డుకోవడం తెలిసిందే. గురువారం ఆర్‌డీఓ శ్రీనువాసులు భూ నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ నిబంధల ప్రకారం పరిహారం అందిస్తామని, పనులకు సహకరించాల్సిందిగా కోరారు. శుక్రవారం సర్వే డివిజన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ వర్మ సర్వే పనులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. కొంతన్‌పల్లిలో 70 ఎకరాల భూమి త్రిపుల్ ఆర్ రోడ్డు కోసం సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సతీష్ తదితరులు ఉన్నారు.

కళ్లలో కారంచల్లి, రాడ్డుతో బాది

- వ్యక్తి దారుణ హత్య
- వివాహేతర సంబంధమే కారణం
- రాయికోడ్ పీఎస్‌లో లొంగిపోయిన నిందితుడు


నిందితుడిని చూపుతున్న పోలీసులు


కృష్ణ (ఫైల్)

రాయికోడ్(అందోల్): వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లంపల్లిలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు... గ్రామానికి చెందిన ఎం.కృష్ణ (35)కు, ఝరాసంగం మండలం ఎల్గోయికి చెందిన మహిళతో 2008లో వివాహమైంది. కొన్నాళ్ల పాటు వారి కాపురం సజావుగానే సాగింది. ఈ క్రమంలో నల్లంపల్లికి చెందిన మూలగోలి ప్రశాంత్‌తో కొంతకాలంగా ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. భర్తకు ఈ విషయం తెలియడంతో ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 10 నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. అతను మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి అతడు బీడీలు తెచ్చుకుంటానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. ఇంతలో భగీరథ వాటర్ ట్యాంక్ సమీపాన ప్రశాంత్‌కు కృష్ణ ఎదురుపడ్డాడు. అప్పటికే మద్యంమత్తులో ఉన్న ప్రశాంత్.. కృష్ణ కారంపొడిని కంట్లో కారం పొడి చల్లి ఇనుప రాడ్డుతో తలపై మోదాడు. కిందపడిపోయిన తర్వాత కూడా తలపై బీరుసీసాతో విచక్షణారహితంగా పొడిచి, ప్రధాన రహదారిపై నుంచి కొంతదూరం లాక్కెళ్లి పడేశాడు. నిందితుడు శుక్రవారం తెల్లవారుజాము రాయికోడ్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, ఎస్‌ఐ తరలించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

గిరిజనులకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలి

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో యూనిట్‌గా తీసుకుని జనాభా ప్రతిపాదికన గిరిజనులకు ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్న జిల్లాలవారీగా చట్టసభల్లో గిరిజనులకు అవకాశం కల్పించలేదన్నారు. ఎస్సీల మాదిరిగానే గిరిజనులకు కూడా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు.

కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా రామాయంపేటకు చెందిన రొయ్యల హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ ఫిషర్‌మెన్ విభాగం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నియామక పత్రాన్ని శుక్రవారం హరిప్రసాద్‌కు అందజేశారు. తన నియామకానికి సహకరించిన తిరుపతిరెడ్డి, తదితరులకు హరిప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

కాటేసిన కరెంట్ తీగలు

- విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు
- కంకర అన్‌లోడ్ చేస్తుండగా ట్రాలీని తాకిన వైనం


ఘటన స్థలంలో ట్రాక్టర్, పైన విద్యుత్ తీగలు


కృష్ణ

ములుగు(గజ్వేల్): కంకర అన్‌లోడ్ చేస్తుండగా విద్యుత్ తీగలు ట్రాలీకి తగిలి ఆపై వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరోవ్యక్తికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన ములుగు మండలం కమలాబాద్‌లో శుక్రవారం జరిగింది. ములుగు పోలీసుల కథనం ప్రకారం... కమలాబాద్‌కు చెందిన ములుగు కృష్ణ(29) కంకర లోడు తరలింపునకు కిరాయి మాట్లాడుకున్నాడు. గ్రామ సమీపాన ఉన్న మామిడితోటలో అన్‌లోడ్ చేసేందుకు వరుసకు సోదరుడైన కనుకరాజును వెంట తీసుకువెళ్లాడు. అన్‌లోడ్ చేస్తుండగా ట్రాక్టర్ ట్రాలీని పైకి లేపాడు. ఈ క్రమంలో 11 కేవీ విద్యుత్ తీగలు ట్రాలీకి తాకాయి. ఈ ప్రమాదంలో కృష్ణ కింద పడిపోయాడు. అతడిని కాపాడే ప్రయత్నంలో కనుకరాజుకు గాయాలయ్యాయి. ట్రాక్టర్ టైర్లు కాలిపోయాయి. కాగా వెంటనే ఇద్దరినీ లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. కృష్ణను పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని తెలిపారు. కనుకరాజు చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య శోధన, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆసరాగా అన్నితానై కుటుంబపోషణ బాధ్యతలు చేపడుతున్న కృష్ణ మృతితో తల్లితండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఎస్‌ఐని సన్మానిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివానందం అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని యావపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు చాలా తేలివిగా బ్యాంకు అకౌంట్ల నంబర్లు, పిన్ నంబర్లు, ఆఫర్లు వచ్చాయని, అధిక లాభాల కోసం పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో అమాయకులను దోచుకుంటున్నారని తెలిపారు. అలాంటి వారిపై జాగ్రత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికి వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. అనంతరం గ్రామస్తులు నూతనంగా వచ్చిన ఎస్‌ఐని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలి


లెర్నింగ్ లైసెన్స్‌లు అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డ్రైవింగ్ వచ్చిన వారు లైసెన్స్‌ను కలిగి ఉండాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక అసెంబ్లీ పరిధిలోని 425 మంది యువతకు సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా అందరం బాధ్యత తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ తెలిసినవారు లైసెన్స్‌లు తీసుకోవాలన్న లక్ష్యంతో మంత్రి హరీశ్‌రావు కృషితో మెదక్ పార్లమెంట్ పరిధిలోని యువతకు ఉచితంగా వాటిని అందిస్తున్నామన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోల్‌లో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి దుర్గప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగలకు రిమాండ్

- 8 మందిలో పట్టుబడిన ఇద్దరు నిందితులు
- పెద్దాపూర్ చోరీ కేసు విచారణలో కదిలిన డొంక

సిద్దిపేటరూరల్: వ్యవసాయ బావుల వద్ద కరెంట్ వైర్లు చోరీకి పాల్పడుతున్న 8 మందిలో నూనె స్వామి, కూరకుల ఆంజనేయులు అనే ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు పంపినట్లు సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి తెలిపారు. వీరి నుంచి 4 కిలోల రాగివైర్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఆరు నిందితులు పర్వతం శ్రీనివాస్, టీ యాదగిరి, టీ షాదుల్, పర్వతం రాజు, టీ సాయిలు, నూనె సాయికుమార్ పరారీలో ఉన్నారన్నారు. సదాశివపేట పెద్దాపూర్‌లో ఓ చోరీ కేసులో విచారణలో భాగంగా వీరు పోలీసులకు పట్టుబడ్డారన్నారు. గతంలో తొమ్మిది కేసులో నిందితులుగా ఉన్నారని ఏసీపీ తెలిపారు.

అటవీప్రాంతంలో మృతదేహం లభ్యం


అటవీ ప్రాంతంలో పోలీసులు

రామాయంపేట(మెదక్): ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటన నార్సింగి మండలం సంకాపూర్ అటవీప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అటవీప్రాంతంలో పనిచేసే వాచర్, మృతదేహాన్ని చూసి సర్పంచ్ సుజాత శ్రీనివాస్‌కు సమాచారం అందజేశాడు. వారు పోలీసులకు విషయాన్ని చెప్పారు. వారు ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. సుమారుగా 20 రోజుల క్రితం సదరు వ్యక్తి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని కుక్కలు, అడవి జంతువులు పీక్కుతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. నార్సింగి ఎస్‌ఐ నర్సింలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయులకు కన్నీళ్లు మిగిల్చి...

ఆత్మీయులకు కన్నీళ్లు మిగిల్చి, తిరిగిరాని లోకాలకు వెళ్లారు. బలవన్మరణంతో కుటుంబసభ్యులకు తీరని వ్యథ మిగిల్చారు. పటాన్‌చెరు, చిన్నకోడూరు, జహీరాబాద్, కోహెడ రూరల్‌లో ఆత్మహత్య సంఘటనలు చోటుచేసుకున్నాయి.

భార్య కాపురానికి రావడం లేదని..


కిషన్

పటాన్‌టౌన్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపనతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ స్టే షన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లయ్య కథనం ప్రకారం... ఐలాపూర్ పెద్దతండా వాసి కిషన్(37) లారీ డ్రైవర్. ఆరు నెలల క్రితం భార్య వాణి గొడవపడ్డాడు. ఈ క్రమంలో పిల్లలను తీసుకొని భార్య మియాపూర్‌లోని పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి అతడు మద్యానికి బానిసయ్యాడు. 3 నెలల క్రితం మియాపూర్‌కు వెళ్లి భార్యను ఇంటికి రావాలని కోరా డు. రానని చెప్పింది. గురువారం మరోసారి రావా లని అడగగా రానంది. శుక్రవారం ఉదయం ఐలాపూర్‌లోని ఇంటిలో అతడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కడుపునొప్పి భరించలేక..

చిన్నకోడూరు(సిద్దిపేట): కడుపు నొప్పి భరించలేక వృద్ధురాలు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన చౌడారంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన వాసి బైకని బాలవ్వ(70) గత కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి వరకు రెండో కుమారుడు పర్శయ్య ఇంట్లోనే ఉంది. రాత్రి పాత ఇంట్లో నిద్రించింది. శుక్రవారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో కిటికీలోంచి చేస్తే ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సుభాష్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు పర్శయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో వివాహిత..

జహీరాబాద్: జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని కాశీంపూర్‌లో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజు కుమార్తె భవానీ(18)కి మన్నాపూర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా ఆరు నెలలుగా భవానీ పుట్టింటి వద్దే ఉంటోంది. కాగా ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు కారణాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. తండ్రి రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవమానంతో వ్యక్తి..


కనకయ్య

కోహెడరూరల్ (హుస్నాబాద్): అవమానం భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని తంగళ్లపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర కనకయ్య(52)కు అదే గ్రామానికి చెందిన బుర్ర నాగభూషణంతో గొడవైంది. ఈ ఘర్షణలో బుర్ర కనుకయ్యపై ముఖంపై అతడు ఉమ్మి వేసి తిట్టాడు. ఈ క్రమంలో దీనిని అవమానంగా భావించిన మనస్తాపంతో కనకయ్య ఇంటి దగ్గర ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి దుర్మరణం

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. చిన్నకోడూరులో ఒకరు, వట్‌పల్లిలో మరొకరు, గజ్వేల్ రూరల్‌లో వృద్ధురాలు చనిపోయారు.

అల్లుడికి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి వస్తూ..

బైక్, ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు దుర్మరణం


తిరుపతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): బైక్, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొని రైతు మృతిచెందాడు. ఈ సంఘటన గుర్రాలగొంది శివారులో శుక్రవారం జరిగింది. పోలీసులు కథనం ప్రకారం..విఠలాపూర్ వాసి, రైతు చెలుకల తిరుపతిరెడ్డి(53) సిద్దిపేటలో ప్లాట్ ఉంది. దానిని అక్కడే ఉంటున్న అల్లుడు రాజిరెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. గుర్రాలగొందిలోని బ్యాంక్‌లో నగదు డ్రా చేసుకొని తిరుగుపయనంలో శివారు వద్ద అతను ప్రయాణిస్తున్న బైక్, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అతను ఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడి కుమారుడు చెలుకల రమేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు శిల్ప ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


బీమ్లానాయక్ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన అల్మాయిపేట గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పెంటయ్య కథనం ప్రకారం.. పుల్కల్ మండలం గొంగులూర్‌తండాకు చెందిన బీమ్లానాయక్(55) జోగిపేటలో బోరు మోటారు రిపేర్ చేయించుకొని తిరుగు పయనవుతున్నాడు. అల్మాయిపేట సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కకు బైక్ పార్క్ చేశాడు. అనంతరం 161 రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న జోగిపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మనుమడిని తీసుకొచ్చేందుకు వెళ్లి..


ఎల్లవ్వ

గజ్వేల్‌రూరల్: మనుమడిని తీసుకువచ్చేందుకు వెళ్లిన వృద్ధురాలు ఆ స్కూల్ బస్సు ఢీకొని మృతిచెందింది. ఈ సంఘటన గజ్వేల్ మండలం సింగాటంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని సింగాటంకు చెందిన దార ఎల్లవ్వ(60) మనువడు అచ్యుత్ గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. సాయంత్రం అచ్యుత్‌ను ఎడమ వైపు వదిలిపెడుతోంది. ఆ వైపునకు వెళ్లేందుకు ఎల్లవ్వ యత్నించింది. ఇది గమనించని డ్రైవర్ బస్సును పోనివ్వడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎల్లవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.